గజగజ.. విలవిల

వాతావరణంలో మార్పులకు... అపారిశుధ్యం తోడవడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. చలిగాలులకు గజగజలాడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు మొదలుకుని ఏ చిన్న వైద్యశాలలో చూసిన రోగుల క్యూ కనిపిస్తోంది.



ఆస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న బాలిక



ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వర బాధితులు

- వాతావరణంలో మార్పుతో రోగాల ముసురు
- దగ్గు, జ్వరం, జలుబు, కీళ్లనొప్పులతో సతమతం
- ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న రోగులు
- పరిశుభ్రత లేక పెరిగిన దోమల బెడద

పెదగంట్యాడ: ప్రజలను జ్వరాలు కుదిపేస్తున్నాయి. ఇందుకు పారిశుధ్యం క్షీణించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇటు రక్త పరీక్షలు అటు వైద్య చికిత్సల ఖర్చులతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణ, మురుగు కాలువలను శుభ్రం చేయించడం కూడా అధికారులు మరిచిపోయారు. ఫలితంగా దోమల దాడితో ప్రజలు నరకం చూస్తున్నారు..



వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి రమేష్‌బాబు



మందుల కౌంటర్ వద్ద జ్వర పీడితులు

మండలంలో పెదగంట్యాడ, సిద్దేశ్వరం, గిరిజాకాలనీ, గంగవరం, దేవాడ, నమ్మిదొడ్డిలో 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటికి జ్వరపీడితుల తాకిడి పెరిగింది. సాధారణ దగ్గు, జలుబుతో పాటు కీళ్లనొప్పులు, తలభారం వంటి లక్షణాలతో చికిత్స కోసం వస్తున్నారు.

కానరాని వైద్య శిబిరాలు

ప్రజలను జ్వరాలు పట్టి పీడిస్తున్నా ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో రోగులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వైద్యం పొందాల్సి వస్తోంది. అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతా చెత్తమయం

కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. ఎక్కడికక్కడే చెత్తా చెదారం కుప్పలుగా దర్శమిస్తున్నాయి. పూడికలు సక్రమంగా తీయకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లడం లేదు. మొక్కుబడిగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాలువల్లో మురుగు తీసినా రోజుల తరబడి వదిలేయడంతో దుర్వాసన కొడుతుంది..దీనిపై ఈగలు, దోమలు వాలి అవి ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. ఆ పదార్థాలు తిన్న ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు.

ఫీవర్ సర్వే ఏదీ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి **సీజన్‌లో ఫీవర్ సర్వే ఇంటింటా నిర్వహించేవారు.. జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి** ఇంటి **వద్దే మందులు ఇచ్చి బాగు చేసేవారు**..అవసర**మైనవారిని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి దగ్గరుండి చికిత్స అందించేవారు.**

రోజు 20 నుంచి 40 జ్వరాల కేసులు

మండలంలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో రోజు ఓపీ 50 నుంచి 80 వరకూ చూస్తున్నారు. అందులో **20 నుంచి 40 జ్వరాల కేసులే నమోదువుతున్నాయని వైద్యులు తెలుపుతున్నారు.**

మూడు రోజులుగా జ్వరం



మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను.గతంలో ఇంటికి వచ్చి ఆరోగ్య సమస్యలపై ఆరా తీసేవారు. ఇప్పుడు వైద్య సిబ్బంది ఎవ్వరూ రావట్లేదు. ఇంట్లో వాళ్లు మందులు షాపు నుంచి తీసుకొచ్చిన మాత్రలు వేసుకున్నా జ్వరం తగ్గలేదు. ఓపిక లేకున్నా ఆస్పత్రికి వచ్చాను.

–సీహెచ్ అప్పలరెడ్డి, పెదగంట్యాడ

సాయంత్రం అయితే వణుకు



రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను.జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో ఇబ్బంది పడుతున్నాను. సాయంత్రం అయితే చాలు జ్వరం వచ్చేస్తోంది. సీజనల్ సమయంలో ప్రజల రోగాల బారిన పడకుండా ప్రభుత్వ చొరవ తీసుకుని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి పేద ప్రజలను ఆదుకోవాలి.

– యు. మంగమ్మ, పెదగంట్యాడ

నిర్లక్ష్యం చేయకండి



ఇటీవల కురిసిన వర్షాలకు, వాతావరణం కారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంది. వాతవరణంలో మార్పులు కారణంలో జ్వరాలు వస్తున్నాయి..ఇలాంటప్పుడు నిర్లక్ష్యం చేయద్దు.వెంటనే డాక్టర్లను సంప్రదించాలి.రక్త పరీక్షలు చేయుంచుకుని మందులు వాడాలి..సొంత వైద్యం వద్దు..ముఖ్యంగా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా
వైద్యాధికారి పీహెచ్‌సీ దేవాడ

అప్రమత్తత అవసరం



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.నిత్యం చేతులను శుభ్రం చేసుకోవాలి..తాజా ఆహారం మాత్రమే తినాలి. దోమలు కుట్టకుండా చూసుకోవాలి. జ్వర లక్షణాలు కనిపించగానే ప్రజలు వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ రమేష్‌బాబు,
వైద్యాధికారి పీహెచ్‌సీ పెదగంట్యాడ.

క్లుప్తంగా

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు నరసింగరావు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన నరసింగరావు తదితరులు

అగనంపూడి: గుంటూరు జిల్లా నందమూరి తారక రామారావు స్టేడియంలో ఈనెల 28,29 తేదీల్లో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ (పరుగు పందెం)పోటీల్లో అగనంపూడి దిబ్బపాలెంకు చెందిన చట్టి నరసింగరావు రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించారు. విశాఖ ఉక్కులో కాంట్రాక్ కార్మికుడిగా పనిచేస్తున్న నరసింగరావు పోటీల్లో క్రీడా ప్రతిభను చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అలాగే 800 మీటర్ల పరుగు పందెంలో పసిడి పతకాన్ని దక్కించుకున్నారు. వచ్చే నెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు కేరళ రాష్ట్రం తిరుచూరులో నిర్వహించనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు నరసింగరావు పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

అగనంపూడి: దువ్వాడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 88, 87 వార్డుల కార్పొరేటర్లు మొల్లి ముత్యాలు, బొండా జగన్ మాట్లాడుతూ బాలలు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రచయిత్రికి సత్కారం



రచయిత వరలక్ష్మిని సత్కరిస్తున్న అతిథులు

అగనంపూడి: పర్యావరణంపై కవితా పఠనం, ముక్తపద గ్రస్థం కవితా ప్రక్రియ సాగించిన నిర్వాసితకాలనీకి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఎస్.ఎస్.ఎస్.వరలక్ష్మిని విజయవాడలో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు భాషను చిన్న చూపు చూస్తున్న నేటి సమాజంలో కొన్ని వర్గాలకు తెలుభాష గొప్పదనం, తియ్యదనం తెలియజేయడమే తన లక్ష్యమన్నారు. వరలక్ష్మి ప్రస్తుతం పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులచే పూజలు చేయిస్తున్న అర్చకుడు వాసుదేవశర్మ

పెదగంట్యాడ: మార్గశిర బహుళ అమావాస్యను పురస్కరించుకుని జీవీఎంసీ 76వ వార్డు బాల చెరువు ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ భక్తుల పేరిట మంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పద్మశాలి సంఘాల నాయకులు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డు సుందరయ్యకాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పసగడుగుల సీతారాముల కుటుంబానికి పద్మశాలి సేవా సంఘం, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, మార్కండేయ సేవా సంఘాలు సోమవారం ఆర్థిక సాయం అందించాయి. సంఘాల తరఫున సమకూర్చిన రూ.10వేల నగదును ఆయా సంఘాల ప్రతినిధులు పప్పు రాజారావు, రాపర్తి సుబ్బారావు చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘాల నాయకులు తెడ్లపు సతీష్, కొలిపాక అప్పారావు, శేషెట్టి అప్పారావు, డాక్టర్ రాజు, ఐక లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇఫ్కో కార్యాలయం ప్రారంభం



ఇఫ్కో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: గాజువాకలో ఏర్పాటు చేసిన సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) కార్యాలయాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ రాష్ట్రంలో రైతులు, మహిళల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 300 మంది స్వయం అభివృద్ధి సంఘ సభ్యులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. ఇఫ్కో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో ఇప్పటికే 20 వేల మంది మహిళలకు మైక్రో లెండింగ్ ద్వారా నిత్యావసర కిట్లు పంపిణీ చేశామన్నారు. విశాఖపట్నంలో త్వరలో రెండు లక్షల మంది మహిళలకు ఆహార, ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, ఇఫ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 41 అర్జీలు



తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వార్డు పరిధిలోని మింది, గుడివాడఅప్పన్నకాలనీ, రాంనగర్, రాజీవ్‌నగర్, కాళికానగర్ ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న పలు రెవెన్యూ పరమైన సమస్యలను తహసీల్దార్ శ్రీవల్లి దృష్టికి తీసుకువెళ్లారు. పలు రెవెన్యూ సమస్యలపై కార్పొరేటర్ గుడివాడ అనూష తహసీల్దార్‌కు వివరించారు. సదస్సులో పలు సమస్యలపై 41 అర్జీలు వచ్చినట్లు ఆర్ఐ మృదుల తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు న్యాయం చేయండి
- కలెక్టర్‌కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వినతి

మహారాణిపేట: నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, వేతనాల చెల్లింపులో ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోండా తాడన్న, బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సమస్యను కలెక్టర్ హరేందిర ప్రసాద్ దృష్టికి తెచ్చి చర్చించారు. జీతాలు అందక ఉక్కు ఉద్యోగులు అర్ధాకలితో బతుకుతున్నారని తెలిపారు. గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్) అనేక ఇబ్బందులు పడుతూ యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీతాలు లేక పిల్లల స్కూలు ఫీజులు, బ్యాంకుల దగ్గర తీసుకున్న లోన్లు కట్టలేక, నిత్యావసర ఖర్చులతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ విషయం మీద జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నాలుగు నెలల జీతం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వెంటనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమస్యపై నగర పోలీస్ కమిషనర్‌కు, సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.వి.రత్నం, దాసరి పుల్లారావు, ఎల్.వి.రమణ, వెంకట్ రాజు, పరమానంద, బి.సాయి, ఫణీంద్ర బాబు, ఆంజనేయ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



గెలుపొందిన వాలీబాల్ జట్టుతో అధ్యాపకులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ మహోత్సవ్ 2025 జోనల్ క్రీడా పోటీలు సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా జోనల్ పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని వారి సత్తా చాటారు. వాలీబాల్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల, కబడ్డీ పోటీల్లో విశాఖ ఇంజినీరింగ్ కళాశాల, బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్లు గెలుపొందాయి. ప్రారంభోత్సవం కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జోనల్ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నిశ్చల కిరణ్, ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్.రాంబాబు, ఎస్.నవ్య, పి.వి. ఎస్.రమణ, జి.ప్రశాంత్, ఎ.భారతి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



తహసీల్దార్ అమలకు అర్జీలు అందజేస్తున్న గ్రామస్తులు

పెదగంట్యాడ: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ గ్రామంలో సోమవారం తహసీల్దార్ అమల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారం కాని భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలన్నారు. పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 45 అర్జీలు అందినట్లు అధికారులు వివరించారు. సర్వే నెంబర్ 243, 244లో 90 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని వాటికి పట్టాలు ఇప్పించాలని కోరారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: అక్రమ మద్యం కలిగి ఉన్నారన్న సమాచారంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో యాతపాలెం జంక్షన్, భారత్ పెట్రోల్ బంక్ కొత్తగాజువాక ప్రాంతంలో విస్తృత తనిఖీలు నిర్వహించి సుందరంపల్లి మోహనరావు, రామారావు అనే వ్యక్తుల నుంచి డిఫెన్స్ మద్యం సీసాలు 33, ఆరు బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపర్చారు. దాడుల్లో సీఐ నాగశ్రీనివాసరావు, ఎస్ఐలు రామకృష్ణ, నరసింహమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న కమిటీ వైస్ చైర్మన్ అయోధ్యరామ్

అగనంపూడి: వచ్చేనెల 8న విశాఖ పర్యటనకు రానున్న ప్రధాని నరేంద్రమోదీ ఆ సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ వైస్ చైర్మన్ జె.అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో 1418 రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాగించడానికి అవసరమైన ముడి ఖనిజాలు కేటాయించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలనుకుంటే సెయిల్‌లో విలీనం చేసి రాష్ట్ర అభివృద్ధికి పరోక్షంగా తోడ్పాటు అందించాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు నగిరెడ్డి రామారావు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, గంగాధర్, భానుమూర్తి, ఎర్రయ్య, నాగసూరి, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ పాఠశాలలను విశాఖలో విలీనం చేయాలి

అగనంపూడి: అగనంపూడి, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీలు విశాఖ జిల్లాలో ఉండగా పాఠశాలలు మాత్రం అనకాపల్లి జిల్లాలో కొనసాగుతున్నాయని ఆ ప్రాంత నాయకులు వాపోయారు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రెండు ఉన్నత పాఠశాలలు, 8 ఎంపీపీ పాఠశాలలను విశాఖ జిల్లా పరిధిలోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ డీఈవో ప్రేమ్ కుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. పినమడక, లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు 8 ప్రాథమిక పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడుతుందని వివరించారు. సమస్యను జిల్లా కలెక్టర్, విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని నాయకులు జి.సోమశేఖర్, ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, తాతారావు, చందు రమేష్ కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో మెదడుకు పదును



రోడ్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ అంశంపై వివరిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల్లో కలిగే ఆలోచనలను ఆవిష్కరించడంతో పాటు వారి మెదడుకి పదును పెట్టడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. స్కూల్‌లో సోమవారం సైన్స్, గణితం ఇతర అంశాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సైన్స్, గణితం అంశాల్లో ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ రిసోర్సెస్, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, జల విద్యుత్, గణితంలో పైథాగరస్ సిద్ధాంతం వంటి నమూనాలు మండల స్థాయికి ఎంపికైనట్టు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేముళ్లు, అన్నపూర్ణ, వేణు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.